క్లుప్తంగా

ఘనంగా అశిరాంబ అమ్మవారి జాతర



జాతరలో గరగ నృత్యం చేస్తున్న కళాకారులు

కపిలేశ్వరపురం: అంగర గ్రామ దేవత అశిరాంబ అమ్మవారి జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. జాతర ఉత్సవ నిర్వహణ కమిటీ ప్రతినిధి రాగం రామచంద్రరరావు పర్యవేక్షణలో ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. డప్పు వాయిద్యాలు, విచిత్ర వేషధారణలు, గరగ నృత్యాలు, కర్రసాము తదితర ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆదివారం సెలవు దినం కావడంతో ఉద్యోగులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో జాతరను తిలకించారు.

ఘనంగా సాహిత్య సభ



సమాజ సేవకురాలు పద్మజారాణిని సత్కరిస్తున్న నిర్వాహకులు

కాజులూరు: మధునాపంతుల ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక పల్లిపాలెంలోని శ్రీమతి రత్నప్రభ గ్రంథాలయంలో ఆదివారం సాహిత్య సభ ఘనంగా జరిగింది. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కిరణ్ మధునాపంతుల, డైరెక్టర్ మధునాపంతుల సత్యనారాయణమూర్తి (ఆంధ్ర కుటీరం) ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ముందుగా వర్తమాన సాహిత్యం–తీరుతెన్నులు అనే అంశంపై ప్రఖ్యాత కవి, రచయిత జి.వెంకటకృష్ణ ప్రసంగించారు. డొక్కా సీతమ్మ జీవిత చరిత్రపై ఎంఎస్ సూర్యనారాయణ రచించిన దయా మేఘ మల్హరి కవితను ఆలపించారు. సాహితీ వేత్త దాట్ల దేవదానం సారథ్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. కాకినాడ, పరిసర గ్రామాల నుంచి హాజరైన కవులు తమ కవితలను వినిపించారు. అనంతరం సామాజిక సేవకురాలు, కవి పద్మజారాణిని సత్కరించారు. కార్యక్రమంలో సాహితీ వేత్త ఎంవీ చలపతితో పాటు, పలువురు కవులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

దుఃఖాన్ని దిగమింగి.. నేత్ర దానం



సాయి గణేష్ (ఫైల్)

కె.గంగవరం: తమ కుమారుడు ఈలోకంలో లేకపోయినా, అతడి నేత్రాలు మరో ఇద్దరికి చూపునిస్తాయని ఆ తల్లిదండ్రులు భావించారు. కుమారుడు మరణించాడన్న దుఃఖాన్ని దిగమింగుకుని, అతడి నేత్రాలను దానం చేయడానికి అంగీకరించారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని ఊడిమూడి గ్రామానికి చెందిన కమిటి వీర వెంకట సత్యనారాయణ కుమారుడు సాయి గణేష్(13) అనారోగ్యంతో మరణించాడు. దీంతో గణేష్ కుటుంబ సభ్యులు అతడి నేత్రాలను దానం చేయడానికి ముందుకువచ్చారు. వారిచ్చిన సమాచారంతో ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి సిబ్బంది గణేష్ కార్నియాలను సేకరించారు. గణేష్ కుటుంబ సభ్యులను గ్రామస్తులతో పాటు, ఇతర బంధువులు అభినందించారు.

కూటమి కార్యకర్తల సమావేశం

కాజులూరు: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై మండలానికి చెందిన బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి పార్టీల కార్యకర్తల సమావేశం ఆదివారం గ్రామంలో జరిగింది. జనసేన నాయకుడు అన్యం రామచంద్రమూర్తి అధ్యక్షత వహించారు. వర్షాల వల్ల ప్రబలే వ్యాధులపై కార్యకర్తలు ప్రజలను చైతన్యపర్చాలని నాయకులు సూచించారు.

తల్లిదండ్రులకు కృతజ్ఞతతో మెలగాలి



తల్లిదండ్రులకు పాద పూజ చేస్తున్న విద్యార్థులు

రాయవరం: విద్యార్థులు తమ తల్లిదండ్రులకు కృతజ్ఞత భావంతో మెలగాలని చెల్లూరుకు చెందిన రమలపీఠం వ్యవస్థాపకుడు, వేద పండితుడు సాలిగ్రామ రమణశర్మ అన్నారు. రాయవరంలోని భాష్యం పాఠశాలలో ఆదివారం పేరెంట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పాదపూజ చేశారు. రమణశర్మ మాట్లాడుతూ తల్లిదండ్రుల ప్రాధాన్యాన్ని వివరించారు. పేరెంట్స్ డే సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు ప్రముఖులు బహుమతులను అందజేశారు.

కొండంత అండ.. గోదారంత ధైర్యం

ఒకానొక సమయంలో గోదావరికి వరదొచ్చిందంటే ఆ నదీ పరివాహక ప్రాంతవాసులకు కంటిపై కునుకు ఉండేది కాదు. గట్టును తెంచుకున్న ఉగ్ర గోదారి గ్రామాలపై ఎప్పుడు, ఎలా విరుచుకుపడుతుందోనని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీసేవారు. మహానేత డాక్టర్ వైఎస్సార్ ముఖ్యమంత్రి అయ్యాక, ఈ దుస్థితి నుంచి జనానికి శాశ్వత విముక్తి కల్పించారు. గోదావరికి సమాంతర గట్టును నిలబెట్టి.. ఆయా గ్రామాల ప్రజల గుండెల్లో కొండంత ధైర్యాన్ని నింపారు.

- గోదావరికి సమాంతరంగా ఏటి గట్టు
- నదీ పరివాహక గ్రామాలకు గట్టి భద్రత
- 15 ఏళ్ల క్రితమే వైఎస్సార్ దూరదృష్టి

రామచంద్రపురం: గోదావరి పొంగుతుందంటే పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు బిక్కు బిక్కుమంటూ కాలం గడపాల్సిన పరిస్థితి. ఏ అర్ధరాత్రి ఏటి గట్టు తెగిపోతుందోననే ఆందోళనతో రాత్రంతా యువకులు ఏటిగట్టు వెంబడి లాంతర్లు పట్టుకుని, గండ్లు పడే చోట్ల కాపలా కాయాల్సి వచ్చేది. ఈ దుస్థితి నుంచి.. గోదావరి పొంగినా గుండెలపై చేయి వేసుకుని ప్రశాంతంగా నిద్రపోయే స్థితిని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కల్పించారు. గత మూడు రోజులుగా గోదావరి వరద పరవళ్లు తొక్కుతున్న నేపథ్యంలో రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని నదీ పరివాహక ప్రాంత ప్రజలు ఆ మహానేతను తలచుకుంటూ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

రామచంద్రపురం నియోజకవర్గంలో కె.గంగవరం మండలంలోని గోదావరి నది వెంబడి సుమారు పది గ్రామాలు, 20 శివారు గ్రామాలు 21 కి.మీ. మేర ఉన్నాయి. కూళ్ల గ్రామం నుంచి సుందరపల్లి, కోటిపల్లి, కోట, దంగేరు, కోటగుంట, భట్లపాలిక, మసకపల్లి, బ్రహ్మపురి, కాజులూరు మండలం పిల్లంక గ్రామాలతో పాటు, వీటిని ఆనుకుని శివారు గ్రామాలు కూడా ఉన్నాయి. మండపేట నియోజకవర్గం కపిలేశ్వరపురం మండల పరిధిలో గోదావరి నదిని అనుకుని తాతపూడి, కపిలేశ్వరపురం శ్రీరాంపురం, కోరుమిల్లి, వాకతిప్ప గ్రామాల ప్రజలు జీవనం సాగిస్తున్నారు. గోదావరికి 1986లో భారీ వరద రావటంతో కె.గంగవరం మండలం సుందరపల్లి, కోట, పిల్లంక గ్రామాల వద్ద బలహీనంగా ఉన్న గట్టుకు గండ్లు పడి, బీభత్సం సృష్టించాయి.

మరో సమాంతర ఏటిగట్టు

ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం 2004లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఏటిగట్లను పటిష్టం చేసే బృహత్తర ప్రణాళికకు శ్రీకారం చుట్టారు. గోదావరి పరివాహక ప్రాంతమైన జొన్నాడ నుంచి కపిలేశ్వరపురం మండలం, కె.గంగవరం, కాజులూరు మండల గ్రామాల మీదుగా యానాం వరకు 42 కి.మీ. గోదావరి గట్టును రూ 42 కోట్లతో పటిష్టం చేయించారు. ఏటిగట్టును ఆనుకుని గోదావరిలో మరో గట్టును నిర్మించారు. 2007లో పనులు ప్రారంభించి ఏడాదిన్నరలో పూర్తి చేయటంతో ఏటిగట్టు బలపడింది. అప్పటి నుంచి గోదావరికి ఎప్పుడు వరదొచ్చినా ఏ చింతా లేకుండా ప్రజలు నిర్భయంగా కాలం వెళ్లదీస్తున్నారు. 1986లో వచ్చినట్టుగా గతేడాది గోదావరి వరద సుమారు వారం రోజుల పాటు బెంబేలెత్తించింది. ఈ ఏడాది కూడా జూలై చివరి వారంలో రెండుసార్లు గోదావరి వరద పొంగింది. దీంతో ప్రజలు ఏటిగట్టు పటిష్టం చేసిన ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డిని స్మరించుకున్నారు. గోదావరి ఎంత పొంగినా, ఇప్పటికీ గట్లు చెక్కుచెదరకుండా ఉన్నాయి. దీంతో ఏటిగట్టు గండ్లు పడే పరిస్థితి నుంచి ఆనాడే ఉపశమనం లభించింది.



కె.గంగవరం మండలం సుందరపల్లి వద్ద గోదావరి ఏటిగట్టు

జనాల్లో భయాన్ని పోగొట్టారు



జూలై, ఆగస్టు నెలల్లో గోదావరి పోటు వస్తుందంటే చాలు అప్పట్లో భయంతో గడపాల్సి వచ్చేంది. డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఏటి గట్టును పటిష్టం చేశారు. సమాంతరంగా మరో గట్టును నిర్మించటంతో, గట్టు తెగిపోతుందనే భయం పోయింది. ఎంతో మంది ప్రాణాలను కాపాడేలా చేసిన మహానేతను ఈ ప్రాంత ప్రజలు ఎన్నటికీ మరువలేరు.

– పిల్లి దుర్గాప్రసాద్, ఎంపీటీసీ, కూళ్ల

ఆ మహనీయుడి చలవే..



గోదావరి ప్రవాహ సమయంలో సుందరపల్లి వద్ద అత్యంత ప్రమాదకరంగా ఉండేది. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా చేసిన సమాంతర గట్టు నిర్మాణంతో నేడు గోదావరికి ఎంత వరద వచ్చినా భయం లేకుండా ఉంది. ఇదంతా ఆయన చలవే.

– అడపా నారాయణస్వామి, మాజీ సొసైటీ అధ్యక్షుడు, సుందరపల్లి

రెండోసారీ.. గోదావర్రీ

- మళ్లీ పెరుగుతున్న గోదావరి
- వారం వ్యవధిలో ఎదురైన ముప్పు

కె.గంగవరం: సముద్రంలో కలిసేందుకు ఉరకలెత్తుతున్న గోదావరి వారం రోజుల వ్యవధిలో మరోసారి ఉగ్రరూపం దాల్చింది. ఏటా వర్షాకాలం వచ్చిందంటే గోదావరి పరివాహక ప్రాంత ప్రజలకు వరదల కారణంగా ఆందోళనతో కంటిపై కునుకు లేకుండా పోతుంది. ఇటీవల ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు ధవళేశ్వరం కాటన్ బ్యారేజీకి భారీగా వరద నీరు చేరుతోంది. ఈ నీటిని కాటన్ బ్యారేజి నుంచి సముద్రంలోకి విడిచిపెట్టడం వల్ల కోటిపల్లిలో వరద ఉధృతి రెండోసారి పెరిగింది. శనివారం ఉదయం రెండు అడుగుల మేర తగ్గిన గోదావరి, ఆదివారం సాయంత్రానికి మూడు అడుగుల మేర పెరిగింది. మండలంలోని కూళ్ల నుంచి బ్రహ్మపూరి వరకు వరద గోదావరి ఉగ్రరూపం దాల్చింది. సముద్రంలోకి వరద నీరు కలిసేందుకు ఉరకలేస్తూ పరవళ్లు తొక్కుతోంది. గ్రామంలోని మాధవనగర్, హరినారాయణవారి వీధి, నూకాలమ్మ పేట మూడు వీధులు ముంపులో చిక్కుకున్నాయి. గోదావరి ఒడ్డునే ఉన్న పూరిళ్లలోకి వరద నీరు చేరింది. సుమారు వంద పూరిళ్లు, పెంకుటిళ్లలోకి వరద నీరు చేరడంతో, వారు సమీపంలో ఉన్న బంధువుల ఇళ్లలో ఆశ్రయం పొందారు. కొందరైతే ఆ వరదలోనే ఇళ్లల్లో ఉండిపోయారు. నాలుగు రోజులుగా కాలనీ మొత్తం వరద నీటిలో నానుతోంది. ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరిని చూసేందుకు పరిసర గ్రామాల ప్రజలతో కోటిపల్లి రేవు కిక్కిరిసింది.

నిలకడగా గోదావరి వరద

కపిలేశ్వరపురం: ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి వరద నీరు మండలంలోని లంక గ్రామాల శివారు ప్రాంతాల్లో నిలకడగా కొనసాగుతోంది. వరద తగ్గుముఖం పట్టిందనుకుంటుండగా, ఎగువ ప్రాంతాల్లో నీటిమట్టం పెరిగినా, ఆదివారం గోదావరి నిలకడగా ప్రవహిస్తోంది. కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ రాజ రాజేశ్వరి నారాయణలంకలో పర్యటించారు. కేదారిలంక, అద్దంకివారిలంక, వీధివారిలంక, పల్లపులంక గ్రామాల్లో ఆయా పంచాయతీల కార్యదర్శులు, వీఆర్వోలు, ఇతర సచివాలయ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలో వరద పరిస్థితిపై దృష్టి పెట్టి, పరిస్థితిని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదిస్తున్నారు.



కోటిపల్లి రేవులో మూడు అడుగుల మేర దాటి ప్రవహిస్తున్న గోదావరి



పంటు వెళ్లే దారిలో షాపుల వద్దకు చేరిన గోదావరి



రేవులో ప్రమాద హెచ్చరిక బోర్డును దాటిన వరద ప్రవాహం



కేదారిలంక గ్రామ శివారులో వరద పరిస్థితి

మళ్లీ పోటెత్తిన వరద

- మెరక లంకలకు పొంచి ఉన్న ముప్పు
- భయాందోళనలో ప్రజలు

మామిడికుదురు: గోదావరి వరద మళ్లీ లంక గ్రామాలను ముంచెత్తింది. ప్రధాన రహదారులపై వరద నీరు పొంగి ప్రవహిస్తోంది. పెదపట్నం రత్నాపురం, అరుంధతీపేట ప్రాంతాలను వరద నీరు ముంచెత్తింది. దీంతో పలు ఇళ్లు ముంపునకు గురయ్యాయి. మధ్యలంక మొత్తం ముంపునకు గురి కావడంతో పశువులను రోడ్లపై కట్టేశారు. అప్పనపల్లి ఉచ్చులవారిపేట రోడ్డు పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఈ రోడ్డుపై నాలుగడుగుల మేర వరద ప్రవహిస్తోంది. దీంతో అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరద నీటిలో దిగి అష్టకష్టాలు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. పాశర్లపూడిబాడవ, పాశర్లపూడిలంక ప్రాంతాల్లో మత్స్యకార పేటలను వరద ముంచెత్తడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరద తాకిడికి గురైన గ్రామాల్లో రెవెన్యూ, వైద్య ఆరోగ్య, పశు సంవర్ధక శాఖ ఉద్యోగులతో పాటు సచివాలయ ఉద్యోగులు సేవలందిస్తున్నారు.

ఏడు రోజులైనా వీడని వరద

సఖినేటిపల్లి: వరద ఉధృతి ఏడు రోజులు గడుస్తున్నా కూడా ముంపు తగ్గక బాధితులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రోజురోజుకూ వరద తగ్గినట్టే తగ్గి పెరుగుతుండడంతో టేకిశెట్టిపాలెం, అప్పనరామునిలంక, సఖినేటిపల్లిలంక, సఖినేటిపల్లి గ్రామాల్లో వరద ఉధృతి ఆదివారం యథాతథంగా కొనసాగుతుంది. గత ఆదివారం నుంచి పోటెత్తిన వరద నేటికి ఏడో రోజుకు చేరడంతో ఆయా ప్రాంతాల ప్రజలు వరద నీటిలో పడుతున్న బాధలు అన్నీ ఇన్నీ కావు. అప్పనరామునిలంకలో 13 ఏరియాల్లో వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. టేకిశెట్టిపాలెం ఏటిగట్టు వద్ద నుంచి మత్స్యశాఖ ఏర్పాటు చేసిన పడవలపై గ్రామస్తులు అప్పనరామునిలంకకు రాకపోకలు సాగిస్తున్నారు. సఖినేటిపల్లి లాకుపేటలో వరద ఉధృతి కొనసాగుతోంది. సఖినేటిపల్లి లాకుల వద్ద నుంచి పడవలపై వారు లాకుపేటకు రాకపోకలు సాగిస్తున్నారు. టేకిశెట్టిపాలెం అగ్నికుల క్షత్రియ కాలనీ ఇంకా జలదిగ్బంధంలో ఉంది. మండలంలోని ఆయా వరద ముంపు గ్రామాల్లో పడవలపై టిన్ల ద్వారా తాగునీటి పంపిణీ కొనసాగుతోంది.

జలదిగ్బంధంలో బడుగువానిలంక

ఆలమూరు: మండలంలోని గోదావరి నదీతీరాన ఉన్న బడుగువానిలంకను వరద చుట్టుముట్టింది. గ్రామం నలుమూలల్లో ఉన్న పాయల్లో ఆదివారం సాయంత్రానికి వరద వచ్చి చేరి ఉద్యాన పంటలను ముంచెత్తింది. ఇప్పటికే అనేక పల్లపు ప్రాంతాల్లో వందలాది ఎకరాల పంటలు ముంపునకు గురయ్యాయి. తహసీల్దార్ డీవీఎస్ అనిల్‌కుమార్, ఎస్సై ఎల్.శ్రీను నాయక్, ఎంపీడీఓ ఎ.మేరీరోజ్ తదితరులు స్థానిక అధికారులతో కలసి గ్రామంలో పర్యటించారు. వరద బాధితులను ఆదుకునేందుకు వీలుగా ఆరు మరబోట్లను, 50 లైఫ్ జాకెట్లను సిద్ధం చేశారు. చెముడులంకలోని శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణ మండపంలో పునరావాస శిబిరాన్ని ఏర్పాటు చేసి బియ్యం, మంచినీళ్ల ప్యాకెట్లు, నిత్యావసరాలను సమకూర్చుతున్నారు.

పల్లపు ప్రాంతాల జలమయం

అయినవిల్లి: వరద ఉధృతి క్రమేపీ పెరుగుతోంది. లంక గ్రామాల్లోని వరదనీటి ముంపుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని వీరవల్లిపాలెం, అయినవిల్లిలంక, పొట్టిలంక, కొండుకుదురులంక, తొత్తరమూడిలోని కె.పెదలంక, చింతనలంక, మడుపల్లిలంక గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. సుమారు వారం రోజులుగా వరద పల్లపు ప్రాంతాలను ముంచెత్తడంతో వీరవల్లిపాలెం, అయినవిల్లిలంక గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. లంక ప్రజలు ముక్తేశ్వరం–అయినవిల్లిలంక ఎదురుబిడెం వద్ద కాజ్‌వే మునకతో పడవలపైనే రాకపోకలు కొనసాగిస్తున్నారు. వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో పడవలపై ప్రయాణించేవారు విధిగా లైఫ్ జాకెట్లు వేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. పాడి రైతులు వారం రోజులుగా పశుగ్రాసం లేకుండా ఇబ్బందులు పడుతున్నామని పశుగ్రాసం సరఫరా చేయాలని కోరుతున్నారు.

ఉధృతంగా వరద

రావులపాలెం: గోదావరి పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా వచ్చి చేరుతున్న వరదతో గోదావరి ప్రవాహం ఉధృతంగా మారింది. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం అధిక మొత్తంలో నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. దీంతో మండలంలోని గౌతమి, వశిష్ట గోదావరుల్లో వరద నీటి ప్రవాహం ఎక్కువగా ఉంది. దీంతో లంక పొలాలు ముంపు బారిన చిక్కుకున్నాయి. పైన పెరుగుతున్న ప్రవాహంతో నీటి ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెప్పడంతో రైతులు తమ లంక పొలాలను జాగ్రత్త చేసుకుంటున్నారు. అలాగే లంక ప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

అందరూ అప్రమత్తం కావాలి

కొత్తపేట: గోదావరి వరదలు ఉధృత స్థాయిలో ఉన్నందున లంక గ్రామాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎలీషా హెచ్చరించారు. ఆదవారం ఆయన స్థానిక అధికారులతో కలసి వానపల్లి శివారు నారాయణలంకలో పర్యటించారు. ఎప్పటికప్పుడు వరద పరిస్థితిని సమీక్షిస్తూ తగు ముందస్తు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ముంపు ప్రభావిత ప్రాంతాల్లో అన్ని రకాల సహాయక చర్యలు తీసుకుంటున్నట్టు తహసీల్దార్ ఎలీషా తెలిపారు.

లంక ప్రజల ఇబ్బందులు

పి.గన్నవరం: భద్రాచలం వద్ద వరద తగ్గుముఖం పట్టినప్పటికీ కోనసీమలోని వశిష్ట, వైనతేయ, గౌతమీ నదీపాయల్లో వరద ఉధృతి పెరుగుతోంది. దీంతో లంక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, బూరుగులంక, అరిగెలవారిలంక, శివాయలంక గ్రామాల ప్రజలు పడవలపై ప్రయాణిస్తున్నారు. కె.ఏనుగుపల్లి రహదారిపై మూడు అడుగుల ఎత్తున వరదనీరు ప్రవహిస్తుండటంతో, వరదనీటిలో ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. మానేపల్లి శివారు శివాయలంక, పల్లిపాలెం రహదారులపై వరదనీరు ప్రవహిస్తోంది. శివాయలంకకు పడవలు ఏర్పాటు చేశారు. కోనసీమ జిల్లాకు సరిహద్దులో ఉన్న పశ్చిమ జిల్లాకు చెందిన పెదమల్లంక, ఆనగర్లంక, సిర్రావారిలంక, పుచ్చల్లంక, చాకలిపాలెం శివారు కనకాయలంక గ్రామాల ప్రజలు పడవలపై ప్రయాణిస్తున్నారు. లంకలు నీట మునగడంతో పశువులకు మేత లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తపేట ఆర్డీఓ జీవీవీ సత్యనారాయణ, తహసీల్దార్ షేక్ హుస్సేన్, ఎంపీడీఓ త్రిశూలపాణి వరద పరిస్థితిని సమీక్షిస్తున్నారు.



పి.గన్నవరం మండలం కె.ఏనుగుపల్లిలో నీట మునిగిన అంగన్‌వాడీ భవనం



సఖినేటిపల్లి లాకుపేటలో గోదావరి పాయకు చేరి వరద ముంపులో దాబా

వరద ఉధృతిని పరిశీలించిన మంత్రుల బృందం



కోటిపల్లి మత్స్యకార కాలనీలో పర్యటిస్తున్న మంత్రులు

కె.గంగవరం: కోటిపల్లిలో వరద ఉధృతిని ఆదివారం మంత్రుల బృందం పరిశీలించింది. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, పశు సంవర్ధన, మత్స్య శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, జేసీ టి.నిషాంతి తదితరులు కోటిపల్లి గ్రామంలోని మత్స్యకార కాలనీలో నీట మునిగిన ప్రాంతాలను పరిశీలించారు. అలాగే ఫెర్రీలోని పుష్కర ఘాట్ల వద్ద వరద ఉధృతిని, సుందరపల్లి వద్ద బలహీనంగా ఉన్న గట్టును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత విలేకరులతో మాట్లాడుతూ గట్టు పటిష్టం చేసేందుకు కావాల్సిన చర్యలు చేపట్టాలని సూచించామన్నారు. సుమారు రూ.47 కోట్ల నిధులు అవసరమవుతాయని మంత్రుల బృందం సీఎం చంద్రబాబుకు నివేదించి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. తొలుత స్థానిక సొసైటీ వద్ద పశు సంవర్ధన శాఖ ద్వారా పాడి రైతులకు ఉచితంగా మందులు, దాణాను పంపిణీ చేశారు.

ఎమ్మెల్యే పరామర్శ

కపిలేశ్వరపురం: మండలంలోని కేదారిలంక గ్రామానికి చెందిన సాదా ఈశ్వరరావు, తెలగాని సుబ్బయ్య, అన్యం ఏసుబాబు వివిధ కారణాలతో ఇటీవల మరణించారు. వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆదివారం పరామర్శించారు.

సత్యసాయి శత జయంతికి సహకరిస్తా: మంత్రి



మంత్రి సుభాష్‌కు జ్ఞాపికను అందిస్తున్న కన్వీనర్లు

రామచంద్రపురం రూరల్: ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న భగవాన్ సత్యసాయి శత జయంతి ఉత్సవాలకు సహకరిస్తానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పుట్టపర్తి సత్యసాయి సేవా సంస్థలు అందిస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని చెప్పారు. ద్రాక్షారామలోని సత్యసాయి నిలయంలో శనివారం సత్య సాయిబాబా శత జయంతి ఉత్సవాల ప్రణాళికా సమావేశం జరిగింది. భగవాన్ సత్యసాయి సేవా సమితి కన్వీనర్ విస్సాప్రగడ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి సుభాష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సత్యసాయి సేవా సంస్థలు ఆధ్యాత్మికంగా, వైద్య, విద్యాపరంగా అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా అధ్యక్షుడు ఎ.కొండబాబు, సమితుల కన్వీనర్లు రావిపాటి నారాయణరావు, మన్యం వర్ధనరావు, డాక్టర్ ప్రభాకర్, అరుణాదేవి, విజయలక్ష్మి, అల్లం భీమశంకరం, మేకా కుమార్, సబ్ జోన్ కన్వీనర్ నున్న నరసింహమూర్తి, బాల వికాస్ గురువులు, సభ్యులు పాల్గొన్నారు.

అయినవిల్లికి పోటెత్తిన భక్తులు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామికి మహానివేదన అనంతరం వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించారు. స్వామివారి లఘున్యాస, ఏకాదశ రుద్రాభిషేకాల్లో 37 మంది, లక్ష్మీగణపతి హోమంలో 14 మంది దంపతులు పాల్గొన్నారు. 20 మంది తమ నూతన వాహనాలకు పూజలు చేయించుకున్నారు. ఇద్దరు చిన్నారులకు తులాభారం నిర్వహించారు. స్వామివారి అన్నదాన పథకంలో 1,413 మంది అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ పూజలు, అన్నదాన విరాళాలుగా స్వామివారికి రూ.1,28,756 ఆదాయం లభించిందని ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థిగా ఉండాలి

రావులపాలెం: ఉపాధ్యాయులు నిత్య విద్యార్థిగా ఉండాలని, ముఖ్యంగా సైన్స్ ఉపాధ్యాయులు శాస్త్ర, సాంకేతికతను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) ఎం.కమలకుమారి అన్నారు. స్థానిక చిర్ల కనికిరెడ్డి ఫంక్షన్ హాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఫిజికల్ సైన్స్ టీచర్లకు నూతన పాఠ్య పుస్తకాలపై ఆదివారం ఒక రోజు ఓరియంటేషన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఫిజికల్ సైన్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీఈవో కమలకుమారి మాట్లాడుతూ సైన్స్ పరంగా విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వం అలవడాలన్నారు. అప్పుడే సైన్స్‌పై ఆసక్తి, నేర్చుకోవాలనే తపన పెరుగుతుందన్నారు. మారిన సిలబస్‌కు అనుగుణంగా ఫిజికల్ సైన్స్ సబ్జెక్టులో ఉపాధ్యాయులకు వర్క్‌షాప్ నిర్వహించడంపై అభినందనలు తెలిపారు. సమావేశంలో ప్రముఖ విద్యాదాత చిర్ల కనికిరెడ్డి మాట్లాడుతూ విద్యాపరమైన కార్యక్రమాలు, విద్యాభివృద్ధికి తన వంతు సహకారం అందించనున్నట్టు తెలిపారు. డీఈవో ఎం.కమలకుమారి, విద్యాదాత కనికిరెడ్డి తదితరులను ఘనంగా సత్కరించారు.

శాకంబరిగా ఉరదాలమ్మ

ఆలమూరు: గుమ్మిలేరులో వేంచేసిన గ్రామదేవత ఉరదాలమ్మ అమ్మవారు శాకంబరి మాతగా భక్తులకు ఆదివారం దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహిళలు అమ్మవారిని వివిధ కూరగాయలు, ఆకుకూరలతో శాకంబరి మాతగా తీర్చిదిద్దారు.